ప్రజాశక్తి

శనివారం 18 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మండలి విజేత టిడిపి

◆ 8 రౌండ్లలోనూ చిరంజీవిరావుదే ఆధిక్యం
◆ సిట్టింగ్ బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ సహా 34 మందికి డిపాజిట్లు గల్లంతు
◆ పోస్టల్ బ్యాలెట్ సహా పోలైన ఓట్లు 2,13,035
◆ లెక్కించిన ఓట్లు 1,89,017
◆ అభ్యర్థి విజయానికి కావాల్సినవి 94,509
◆ టిడిపికి వచ్చినవి 82,977 ఓట్లు - విజయానికి ఇంకా రావాల్సినవి 11,551
◆ ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టిన ఎన్నికల అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. విజేతగా ఆ పార్టీ తరపున బరిలోకి దిగిన వేపాడ చిరంజీవిరావు నిలిచారు. ఈ నెల 16న ఉదయం 8 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా 17వ తేదీ రాత్రి వరకూ మండలి ఓట్ల లెక్కింపును సుమారు 500 మంది సిబ్బంది చేపట్టారు. తెలుగుదేశం అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు, వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. పోలైన ఓట్లలో టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు 82,977, సీతంరాజు సుధాకర్‌కు 55,749 ఓట్లు వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. చిరంజీవిరావు విజయానికి ఇంకా 11,551 ఓట్లు అవసరం అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియకు వెళ్లారు. 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేషన్ చేస్తూ అతనికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లను కలిపే దిశగా శుక్రవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది కసరత్తు ఆరంభించారు. అయితే ఓ న్యాయవాది వేసిన కేసు నేపథ్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం తమకు లోబడి ఉండాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో విజేతను ఎన్నికల అధికారి ప్రకటిస్తారా ? లేదా ? అన్నదానిపై రకరకాల చర్చలు నడుస్తున్నాయి.

బిజెపికి డిపాజిట్ గల్లంతు

బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్‌కు 10,884 ఓట్లురాగా డిపాజిట్ గల్లంతైంది.



టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవిరావు

2017లో టిడిపి మద్దతుతో మాధవ్ బిజెపి తరపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీగా గెలుపొందారు. అంతకు ముందు 2007, 2011 సంవత్సరాల్లో వరుసగా పిడిఎఫ్ అభ్యర్థి ఎంవిఎస్ శర్మ ఈ స్థానంలో గెలిచారు. 2023లో మిగతా 2లో..

జగనన్నను నమ్మని పట్టభద్రులు

◆ మండలి ఎన్నికల్లో అధికార పార్టీకి కోలుకోలేని దెబ్బ
◆ 'ఎంట్రీ' ఆలస్యమే అయినా పక్కా ప్లాన్‌తో చిరంజీవిరావు
◆ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీకి రాలని ఓట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రులు జగనన్నను నమ్మలేదని తాజా మండలి ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము గెలుపొందితే.. విశాఖను రాజధానిగా చెయ్యాలనే తమ పార్టీ ప్రతిపాదనకు ఓటర్లు ఆమోద ముద్ర వేసినట్టేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహా ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బొత్స వంటి నేతలు గడిచిన కొన్ని రోజులుగా చేస్తున్న ప్రకటనలకు ఈ ఓటమితో గట్టి దెబ్బ తగిలింది. శుక్రవారం వెలువడ్డ మండలి ఫలితాల్లో వైసిపి రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. విశాఖ నగరం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి వంటి పట్టణాల్లోనూ అధికార పార్టీకి ఎదురీత తప్పలేదు. విశాఖలోని ఉత్తరం, పశ్చిమ నియోజకవర్గాల్లో మినహా మిగతా చోట్ల నాయకులెవరూ పట్టించుకున్న పాపాన పోలేదన్న సమీక్షలు వైసిపిలో ప్రారంభమయ్యాయి. మొత్తం 8 రౌండ్లలో ఏ రౌండ్‌లోనూ వైసిపి లీడింగ్‌లోకి వెళ్లలేని గడ్డు స్థితి ఎదుర్కొంది. అధికారంలో ఉన్న చోట



వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్

ఉప ఎన్నికలు, ఇలాంటి ఎన్నికల్లో సాధారణంగా పై చేయి అధికార పార్టీకి ఉంటుందన్నది తెలిసిందే. రాష్ట్రంలో 2019 నుంచీ ఉపాధ్యాయ, ఉద్యోగులపై కక్ష సాధించే ధోరణితో ఉన్న జగన్‌పై పట్టభద్రులు కూడా అసమ్మతిగానే ఉన్నారన్నది ఈ ఫలితం ద్వారా చూడొచ్చన్నది రాజకీయ విశ్లేషకుల మాట. వైసిపి శ్రేణుల నుంచీ ఇదే వినిపిస్తోంది. సిపిఎస్ అమలు, డిఎల ఎగవేత, ఉపాధ్యాయులను వేధించే విధానాలు కూడా వైసిపిని మిగతా 2లో..

సాగర తీరాన సరికొత్త సొబగులు

▶ వార్త 3లో..

ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టమైంది : గంటా

▶ వార్త 8లో..

ఎయులో ఎపి పిజి సెట్ కార్యాలయం

▶ వార్త 3లో..



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లతో పోలీసులు

ఛాట్-బాట్ పోర్టల్‌కు స్పందన

రూ.40 లక్షల విలువైన ఫోన్లు కనుగొన్న పోలీసులు

వార్త 2లో..

ఆర్‌టిసి భవనంలో 'స్కిల్' సెంటర్..!

◆ పుష్కర కాలం తర్వాత అందుబాటులోకి రానున్న భవనం
◆ పదేళ్ల లీజుకు ఒప్పందం కుదుర్చుకున్న చమురు సంస్థలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగర నడిబొడ్డున ఉన్న ఆర్‌టిసికి చెందిన భవనాన్ని అత్యవసరంగా ముస్తాబు చేస్తున్నారు. పుష్కరకాలంగా నిరుపయోగంగా ఉన్న ఈ భవనానికి తాజాగా మరమ్మతులు చేపట్టి, తుది మెరుగులు అద్దుతున్నారు. విశాఖ ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో ఆర్‌టిసికి బహుళ అంతస్తుల భవనం ఉంది. ఐదు అంతస్తులతో విశాలమైన ప్రాంగణాలతో దీనిని నిర్మించారు. కొన్ని అంతస్తులను పలు అవసరాలకు వినియోగించారు. మిగిలిన వాటిని అద్దెకు ఇచ్చారు. ఈ భవనానికి ముందు పలు వాణిజ్య సముదాయాలు రావడంతో దీని డిమాండ్ తగ్గిపోయింది. ఒకప్పుడు ఈ భవనం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలతో కళకళలాడుతూ ఉండేది. పుష్కర కాలం నుంచి ఖాళీగా ఉంది. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది. గతంలో ఖాళీగా ఉన్న ఆ



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టనున్న ఆర్‌టిసికి చెందిన ఐదు అంతస్తుల భవనం

బిల్డింగ్‌ను అద్దెకు తీసుకోవడానికి పలు సంస్థలు, ఆసుపత్రుల యాజమాన్యాలు ఆసక్తి కనబరిచాయి. కానీ భవనం కింద ఫ్లోర్‌లో వాణిజ్య దుకాణాలు, దక్షిణం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మండలి విజేత టిడిపి

టిడిపి నేరుగా వేపాడ చిరంజీవిరావును బరిలోకి దించి ఆ సీటు దక్కించుకోవడం విశేషం.

గెలుపునకు కారణాలివే..

విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన కౌంటింగ్ తొలి రౌండ్ నుంచీ టిడిపి అభ్యర్థే ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చారు. టిడిపికి జనసేనకు చెందిన పట్టభద్రులంతా ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచి ఓట్లేశారు. అధికార పార్టీ వైసిపిపై ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత కూడా టిడిపికి కలిసొచ్చింది. 20 ఏళ్లకు పైగా వేపాడ చిరంజీవిరావు ఆరోసి రెడ్డి కోచింగ్ సెంటర్, ఇతర కళాశాలల్లో ఎకనమీ లెక్చరర్‌గా కోచింగ్ ఇస్తూ పలువురు శిష్య బృందాన్ని తయారు చేసుకోవడంతో వారంతా ఈ ఎన్నికల్లో ఓటర్లను కలిసి ఆయన విజయానికి చేదోడుగా నిలిచారన్నది రూఢీ అవుతోంది.

వైసిపికి దెబ్బ

ఐదుగురు మంత్రులు, ఇద్దరు డిప్యూటీ సిఎంలు, ఆరుగురు ఎంపీలు, ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎంఎల్ఎలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, జిల్లాల సమన్వయ కమిటీల నేతలు కలిసినా కూడా వైసిపిని ఈ ఎన్నికల్లో గెలిపించుకోలేకపోయాయన్న విమర్శలను అధికార వైసిపి ఎదుర్కొంటోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయంలో ఓట్లను సాధించడంలో పై చేయి సాధించలేకపోయారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధికార వైసిపికి దెబ్బ కొట్టారన్నది స్పష్టంగా తేలిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును అత్యధికంగా టిడిపి లాక్కోగలిగింది. ఎన్నికల బరిలోకి ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చిన చిరంజీవి.. ఓట్ల నమోదులో కూడా గణనీయ పాత్రమీ పోషించలేదు. అయినప్పటికీ ఎమ్మెల్సీ స్థానంలో విజేతగా నిలవడం చూస్తే వైసిపి వ్యతిరేకత పట్టభద్రుల్లో ఎంత ఉందో వెల్లడవుతోంది. అనూహ్యమైన రీతిలో తెలుగుదేశం పార్టీ బరిలోకి దిగి ఈ స్థానాన్ని కైవసం చేసుకోగలిగింది. గతంలో గాడు చిన్న కుమారి లక్ష్మిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు బరిలోకి దింపారు. ఆమెను మార్చాలని ఆయనపై టిడిపి శ్రేణులు ఒత్తిడి తేవడంతో చిరంజీవిరావును బరిలోకి దింపి వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయం సాధించారు.

ప్రధాన అభ్యర్థులెవరేమన్నారంటే ?

తానే గెలవనున్నానన్న ధీమా తొలి నుంచీ ఉందని చిరంజీవిరావు తెలిపారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తనను దెబ్బతీసిందంటూ వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ వెల్లడించారు.

జగనన్నను నమ్మని పట్టభద్రులు

ముంచాయి. అధికారంలో వైసిపి ఉండడంతో ఆ పార్టీకి ఆ మాత్రమైనా ఓట్లు రాలాయని పలువురు అంటున్నారు. అత్యధిక మంది యువకులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ విధానాలపై విసిగి వేసారిన వారంతా టిడిపికే ఓటు వేశారన్నది తెలుస్తోంది. అలాగే పట్టభద్ర యువతలో జనసేన పట్టభద్రులూ ఉన్నారు. చిరంజీవిరావు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందిన వారూ ఉన్నారు. వీరు పలువురు పట్టభద్రులను ఓటు వేయించేందుకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాహనాల్లో పోలింగ్ బూత్‌లకు సైతం తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇవన్నీ టిడిపి అభ్యర్థికి ప్లస్ పాయింట్‌గా ఉన్నాయి. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ పలు నియోజకవర్గాల్లో నాయకులతో సమావేశాలు నిర్వహించడం.. శాలువాలు, పూలదండలు వేదికలపై వేయించుకోవడం మినహా పట్టభద్రులను నేరుగా కలవలేదు. ఆ పార్టీ ముఖ్య నాయకులదీ అదే తీరు. వీటికి తోడు పట్టభద్ర ఓటర్లలో ప్రభుత్వ వ్యతిరేకత కూడా తోడై ఓటమి చెందారన్నది తెలుస్తోంది. ఈ ఉత్సాహంతో వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో అధికారం మాదే అంటూ టిడిపి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఆర్‌టిసి భవనంలో 'స్కిల్' సెంటర్..!

వైపున ద్వారకా బస్ స్టేషన్, ఉత్తరం దిక్కుల్లో ఓ పెద్ద జ్యూయలరీ షాపు ఉన్నాయి. దీంతో ఈ పెద్ద భవనానికి పార్కింగ్ సదుపాయం లేకుండా పోయింది. ఫలితంగా పార్కింగ్ సమస్య వల్ల ఇన్నాళ్లూ ఇది నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం ఈ భవనంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు భారతీయ చమురు సంస్థలు సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఒఐఎల్, ఒఎన్‌జిసి తదితర చమురు సంస్థలు తమ సిఎస్ఆర్ నిధులతో దేశంలోని వివిధ నగరాలలో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖలో స్కిల్ సెంటర్ ఏర్పాటు కోసం ఆర్‌టిసి భవనాన్ని ఎంపిక చేసుకున్నాయి. ఈ సెంటర్‌కు వచ్చే వారు విద్యార్థులే కావడంతో పార్కింగ్ సదుపాయం అంతగా అవసరం ఉండదు. నగర నడిబొడ్డున, రవాణా సదుపాయం ఉన్న ఈ భవనం స్కిల్ సెంటర్ ఏర్పాటుకు అనువుగా ఉంటుందన్న ఉద్దేశంతో చమురు సంస్థలు లీజు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సెంటర్ నిర్వహణ బాధ్యతను విశాఖ హెచ్‌పిసిఎల్ చూసుకోబోతున్నట్లు తెలుస్తోంది.

ఒప్పందం ఇలా..

ద్వారకా బస్ స్టేషన్ స్థలంలో దాదాపు 4 దశాబ్దాల క్రితం ఆర్‌టిసి నిర్మించిన ఈ ఐదంతస్తుల భవనం విస్తీర్ణం సుమారు 84 వేల చదరపు అడుగులు. ఈ భవనానికి చదరపు అడుగుకు నెలకు రూ.13.89 చొప్పున అద్దె చెల్లించేలా చమురు సంస్థలతో ఒప్పందం కుదిరింది. ఈ లెక్కన అద్దె ద్వారా ఆర్‌టిసికి నెలకు రూ.11.60 లక్షల ఆదాయం సమకూరనుంది. ఈ భవనం లీజు ఒప్పందం పదేళ్ల పాటు ఉంటుంది.

ఈ నేపథ్యంలో అవసరమైన పనులు మొదలు భవనాన్ని చమురు సంస్థలకు అప్పగించడానికి ఆర్‌టిసి యాజమాన్యం టెండర్లు పిలిచింది. టెండర్ దక్కించుకున్న సంస్థ ఇప్పటికే పనులు ప్రారంభించింది. విద్యుత్ సదుపాయం, నీటి సరఫరా, డ్రెయినేజీ వంటి వాటిని సమకూర్చడంతో పాటు అవసరమైన పనులు మొదలు పెట్టారు. మరో 4, 5 నెలల్లో ఈ భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఓటర్లకు ధన్యవాదాలు : పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

విశాఖ కలెక్టరేట్ : మండలి ఎన్నికలలో తనకు ఓటు వేసిన వారందరికీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలను సాధారణ ఎన్నికల్లా రాజకీయ పార్టీలు మార్చేసినా.. ఎలాంటి ప్రలోభాలకూ లోనవకుండా 35 వేల మందికి పైగా పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేశారన్నారు. నిస్వార్థంగా ప్రచారంలో పాల్గొని, అహర్నిశలూ కృషి చేసిన ప్రజా సంఘాల కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఛాట్-బాట్ పోర్టల్‌కు విశేష స్పందన

రూ.40 లక్షల విలువైన 200 మొబైల్ ఫోన్లు కనుగొన్న నగర పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఛాట్-బాట్ వెబ్ పోర్టల్‌కు సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారి నుంచి విశేష స్పందన లభిస్తోందని క్రైమ్ డిసిపి గంధం నాగన్న తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసుకున్న వారికి వంద సెల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి అందజేశారని తెలిపారు. సిటీ పోలీస్‌కి చెందిన సిసిఎస్ బృందం టెక్ సెల్ డేటా సహాయంతో అన్ని సాంకేతిక కోణాల్లో విశ్లేషించి రాష్ట్రం లోపల, వెలుపల ఉన్న వివిధ ప్రదేశాలలో బాధితులు పోగొట్టుకున్న మొబైల్‌లను కనుగొన్నామన్నారు. ఢిల్లీ, రాజస్థాన్, కేరళ, తమిళనాడు, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లోని తిరుపతి, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని ప్రజలు పోయిన మొబైల్‌లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం సిసిఎస్ పోలీసులు దొంగతనం చేసిన మొబైల్ వినియోగదారులతో మాట్లాడి వారి నుంచి మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు రూ.40 లక్షల విలువైన 200 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు ఛాట్ బాట్‌లో ఎలా ఫిర్యాదు చేయాలి ? ఆ ఫిర్యాదులను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పోలీసులు ఎలా విచారిస్తారు ? బాధితులకు ఎలా అందజేస్తారు ? అన్న విషయాలపై అవగాహన కల్పించారు. దయచేసి ఎవరూ దొంగ ఫోన్లు కొనవద్దని విజ్ఞప్తి చేశారు.

రాంగోపాల్ వర్మ వ్యాఖ్యలు దారుణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో దర్శకుడు రాంగోపాల్ వర్మ చేసిన అసహ్యకర, దిగజారుడు వ్యాఖ్యలను ఎబిఎన్ఎస్ఒ నాయకులు హరీష్ కుమార్ రెడ్డి, మహేష్ ఖండించారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనను తాను జంతువుగా ప్రకటించుకొన్న రాంగోపాల్ వర్మను ఆధునిక ఫిలాసఫర్ అని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ చెప్పడం దారుణమని పేర్కొన్నారు.

ఎయు పూర్వ విద్యార్థి ఔదార్యం

రూ.50 లక్షలతో ఫార్మశీ కళాశాల హాస్టల్ నిర్మాణం

తల్లిదండ్రుల పేరుతో నిర్మించి, ప్రారంభించిన దేవ పురాణం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ :ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫార్మశీ కళాశాల పూర్వ విద్యార్థి దేవ పురాణం తన ఔదార్యాన్ని చాటుకున్నారు. తనకు విద్యాబుద్ధులు అందించి, ఉన్నతంగా తీర్చిదిద్దిన కాలేజీని సేవ చేయడమే అదృష్టంగా భావించిన ఆయన, తన తల్లి దండ్రులు 'లలిత దేవి-కోటిలింగ మూర్తి పురాణం' పేరిట రూ.50లక్షల విరాళంతో ఫార్మశీ విద్యార్థినుల హాస్టల్‌ను నిర్మించి, దానికి తన తల్లిదండ్రుల పేరు పెట్టారు. దేవపురాణం ఆర్థికసాయంతో ఫార్మశీ కళాశాల ను అనుకుని నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో ప్రారంభింపజేసి, విద్యార్థినులకు అందుబాటులోకి తెచ్చారు.

ఈ సందర్భంగా విసి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న విశ్వవిద్యాలయానికి ఏదైనా చేయాలన్న మహోన్నత ఆశయం ఉండడం అభినందనీయమని, విద్యార్థినులకు ఉపయుక్తంగా ఉండే హాస్టల్ భవన సముదాయానికి నిధులు అందించిన దేవ పురాణాన్ని అభినందించారు. ఇటువంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం విద్యార్థులు భవిష్యత్ సిఇఒలుగా, వ్యాపారవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. దీనికి అనువైన పరిస్థితులను ఎయులో కల్పిస్తున్నామన్నారు. స్టార్టప్‌కు అనువుగా రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఫార్మా టెస్టింగ్ లాబొరేటరీ, ఇతర మౌలిక



ఫార్మశీ హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న విసి ప్రసాద రెడ్డి

వసతులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ దాత, ఎయు పూర్వ విద్యార్థి దేవ పురాణం మాట్లాడుతూ తాను నేడు అమెరికాలో ప్రముఖ ఫార్మశీ సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా ఉండడానికి తనకు విద్యను అందించిన ఎయు ఫార్మశీ కళాశాలేనన్నారు. హాస్టల్ భవనానికి సాయం చేయడం వర్సిటీ తనకు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, హాస్టల్ చీఫ్ వార్డెన్ ఎకెఎం పవార్, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అంబేద్కర్ చైర్‌ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్‌స్టీఫెన్, పురాణం కోటిలింగం(రాంబాబు) పాల్గొన్నారు.

ఎయులో ఎపి పిజి సెట్ కార్యాలయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎయు విసి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎపి పిజిసెట్ కార్యాలయాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం విసి పివిజిడి ప్రసాదరెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఎన్.కిశోర్‌బాబు ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ ఆచార్య ఎన్.రమణయ్యకు వీసీ ప్రసాదరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. సమత, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై. రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, జి.శశిభూషణరావు, ఎస్కె భట్టి, వి. విజయలక్ష్మి, డీన్ ఆచార్య భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

మొక్కుబడిగా ఎటిఎం సేవలు

నగదు లేమితో వినియోగదారుల పాట్లు



ఆనందపురంలోని యుబిఐ ఎటిఎం

ప్రజాశక్తి -అనందపురం : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఎటిఎం సేవలు మొక్కుబడిగానే అందుతుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బ్యాంకుకు వ్యాపారస్తులు, డ్వాక్రా మహిళలు, రైతులు నిత్యం అధికసంఖ్యలో వస్తుంటారు. బ్యాంకు కౌంటర్లలో నగదు విత్‌డ్రా, జమకు క్యూలైన్లలో గంటల తరబడి వేచిఉండే కంటే ఎటిఎం వద్ద సులువుగా పని అయిపోతుందని అందరూ వీటి సేవలనే ఆశ్రయిస్తుంటారు. అయితే ఈ ఎటిఎంలలో తరచూ నగదు కొరతతో ఇబ్బందులు పడుతున్నామని యూనియన్ బ్యాంకు ఖాతాదారులతోపాటు ఇతర వినియోగదారులు వాపోతున్నారు. దీంతో బ్యాంకుల్లో నగదు విత్‌డ్రాకు క్యూలైన్లలో పడిగాపులు పడాల్సి వస్తోందని, దీనిపై బ్యాంకు మేనేజర్, ఇతర అధికారులకు చెప్పినా ఎటువంటి నివారణ చర్యలు చేపట్టడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

351 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ తిరుపతి స్వామి

ప్రజాశక్తి -తగరపువలస :తూడెం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్ర వారం పోలిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తిరుపతిస్వామి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 351 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిప్పాడ, దివీస్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో సర్పంచ్ నరసయ్యమ్మ, ఆసుపత్రి సిబ్బంది, హెచ్ఎం సూర్యనారాయణ, సిఎస్ఆర్ ప్రతినిధి కె నరసింహారావు పాల్గొన్నారు

గీతం టెక్ ఎక్స్‌పోలో యువ సాంకేతిక ప్రతిభ



టెక్ ఎక్స్‌పో తిలకిస్తున్న అతిథులు, గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) సంయుక్త ఆధ్వర్యాన జాతీయస్థాయి సాంకేతిక యువజనోత్సవం, ఐస్క్వేర్ ఆర్-2023లోభాగంగా శుక్రవారం టెక్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల నూతన ఆలోచనలకు వేదికగా టెక్ ఎక్స్‌పో విశేషంగా ఆకట్టుకుంది. సెక్యూరిటీ అంశాలతోపాటు పంటల సస్యరక్షణకు పురుగుల మందులు పిచికారి చేసే డ్రోన్, ఆటోమొబైల్ పరిశ్రమలకు ఉపయోగపడే రీజనరేటివ్ బ్రేకింగ్ పరిజ్ఞానం, ఐఒటి సహాయంతో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయరంగంలో పంటలను క్రిమికీటకాలు, పక్షుల నుంచి రక్షించే సాంకేతిక పరిజ్ఞానం, మిద్దె పంటలు, గార్డెనింగ్‌ను ఐఒటి సాయంతో ఎలా పర్యవేక్షించవచ్చో వంటి నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. వీటితో పాటు చిత్రలేఖనంలో ప్రతిభను చాటుతూ పలు పెయింటింగ్‌లను ప్రత్యేక గ్యాలరీలో ప్రదర్శించారు. సాంకేతిక యువజనోత్సవంలో భాగంగా విఎల్ఎస్ఐ డిజైన్, వెబ్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. యువజనోత్సవం ముగింపు కార్యక్రమంలో ఫోర్త్‌స్క్వేర్ వ్యవస్థాపకుడు కోవెల వెంకటేష్, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, ఐ స్క్వేర్ ఆర్.కన్వీనర్ బి.సెవెన్త్ లైన్, ఫ్యాకల్టీ సలహాదారులు డాక్టర్ఎస్.నీరజ, డాక్టర్ పి.రాజు, కె.వి.సత్యకుమార్ పాల్గొన్నారు. సాంకేతిక యువజనత్సోవంలో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

అంతర వైద్య కళాశాలల పోటీలకు

గీతం వర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక



గీతం దంతవైద్య కళాశాల క్రికెట్ జట్టు

ప్రజాశక్తి- మధురవాడ : వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 24వరకు తిరుపతి శ్రీ.వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో నిర్వహించే అంతర వైద్య కళాశాలల క్రికెట్ పోటీలలో పాల్గొనే గీతం దంత వైద్యకళాశాల జట్టును ఎంపిక చేసినట్లు గీతం దంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామరాజు తెలిపారు. షేక్ ఇషాక్ మదీనా కెప్టెన్‌గా వ్యవహరించే జట్టులో సభ్యులుగా ఎ.భాగ్యకిరణ్, ఎన్‌పి.సాహు, ఎన్.జోనాథన్, జి.గోపి, కె.భరత్‌కుమార్, ఎ.దినేష్, పి.సాయి వెంకట కృష్ణ, ఎస్.శ్రీసాత్విక్, తిరుమల రెడ్డి రఘురామరెడ్డి, ఎన్.సునీల్, ఎ.వరహసాయి శ్రావణ్‌కుమార్, డి.వెంకట రఘువర్ధన్, బి.రోహిత్, వై.వంశీకుమార్‌లను ఎంపిక చేశారు. జట్టు మేనేజర్, కోచ్‌గా డాక్టర్ జయలక్ష్మి వ్యవహరిస్తారని ప్రిన్సిపల్ తెలిపారు.

అంబరాన్ని తాకిన యువజనోత్సవం



యువజనోత్సవంలో భాగంగా సంగీత పోటీలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జాతీయస్థాయి గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్-2023)లో భాగంగా శుక్రవారం వందలాది మంది విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలలో నిర్వహించిన యువజనోత్సావం అంబరాన్ని తాకింది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు నిర్వహిస్తున్న జెమ్-23లో వివిధ కళాశాలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన విద్యార్థులతో గీతం విశ్వవిద్యాలయం ప్రాంగణం కిటకిటలాడింది. జెమ్ యువజనోత్సవంలో భాగంగా బాలయోగి కళా ప్రాంగణం నిర్వహించిన విద్యార్థుల ఫ్యాషన్‌షో, రాక్‌బాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల బృందగానాలు, పాశ్చాత్య నృత్యాలతో ఆహూతులను అలరించారు. విద్యార్థులకు లఘుచిత్ర పోటీ, పేష్ పెయిటింగ్, మొబైల్ యాప్ తయారీ, క్విజ్, సంగీత పోటీలతో పాటు గీతం ప్రీమియర్ లీగ్ క్రికెట్, త్రోబాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించినట్లు జెమ్ కన్వీనర్ డాక్టర్ షంషుద్దీన్ షేక్ తెలిపారు.

సాగర తీరాన సరికొత్త సొబగులు

జి-20 సదస్సు నేపథ్యంలో జోరుగా సుందరీకరణ పనులు

కనువిందు చేస్తున్న గోడలపై గీసిన బొమ్మలు... ఆకట్టుకుంటున్న వర్ణ చిత్రాలు





తీరం వెంబడి, పర్యాటక ప్రదేశాల వద్ద నగర సుందరీకరణలో భాగంగా వేసిన విభిన్న చిత్రాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖ నగరం వేదికగా ఈ నెల 28,29 తేదీల్లో జి-20 దేశాల సదస్సు జరగనున్న నేపథ్యంలో వివిధ ప్రపంచదేశాల నుంచి వచ్చే అతిథులను ఆకట్టుకునేందుకు సాగరతీరంలో సుందరీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి.తీరం పొడవునా, ఇంకా పర్యాటక ప్రదేశాల వద్ద వేస్తున్న విభిన్న తరహా బొమ్మలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. చారిత్రక, డచ్ సమాధులు లోపల, వెలుపల గీసిన వర్ణ చిత్రాలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. జి,20 పేరిట గీసిన బొమ్మ, నీలి మేఘాలు, కమ్ముకున్న మబ్బులు, మరో వైపు గ్రామీణ వాతావరణాన్ని ప్రస్ఫుటింప జేసే అపురూప వర్ణ శోభిత చిత్రాలుకనులకు ఇంపుగా, సొంపుగా ఉన్నాయి. సీతాకోక చిలుక బొమ్మ ఆకర్షణీయంగా ఉంది. ప్రకృతి రమణీయత, సహజసిద్ధ అందాలన్నీ జీవం పోసినట్లు చిత్రాల రూపంలో గోడలపైనే కొలువుదీరి ఉండడంతో అటుగా వెళ్లే సందర్శకులు, స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

'ప్రజాశక్తి' కథనాలకు స్పందన



గెడ్డలో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ, జివిఎంసి సిబ్బంది

గెడ్డలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి – ఆరిలోవ : ఆరిలోవ, హెల్త్‌సిటీలోని ఒక ప్రయివేటు ఆసుపత్రి వెనుక భాగంలో రహదారి కోసం గెడ్డలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అడ్డుకున్నారు. చినగదిలి తహశీల్దారు కార్యాలయ విఆర్‌ఒలు సత్యం దొర, శ్రీనివాసరావు, వరలక్ష్మి, శివకుమార్ అక్రమంగా నిర్మాణం చేపడుతున్న డకింగ్‌ను, ఇసుప ఊచలను తొలగించారు.
శుక్రవారం 'ప్రజాశక్తి' దినపత్రికలో 'గెడ్డపై అక్రమ నిర్మాణం' శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, సచివాలయ, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించారు. మరోమారు అక్రమ నిర్మాణాలు చేపడితే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని రెవెన్యూ సిబ్బంది హెచ్చరించారు.

దుమ్ము, ధూళి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి –గాజువాక : ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పాతగాజువాక కూడలిలో చేపడుతున్న విస్తరణ పనుల్లో జాప్యం వల్ల గతుకుల రోడ్డుతోపాటు వాయు కాలుష్యంతో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు పడుతున్న అవస్థల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోనున్నట్లు జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. ఈ నెల 17న ప్రజాశక్తి దినపత్రికలో 'తవ్వేసి వదిలేశారు... పాత గాజువాకలో దుమ్ము ధూళి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారుల్లో స్పందన వచ్చింది. ప్రజాశక్తి కథనంలో లేవనెత్తిన అంశాలన్నింటినీ పరిష్కరిస్తామని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు.

అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న చొక్కాకుల

ప్రజాశక్తి– సీతమ్మధార : ఉగాది సందర్భంగా నూకాలమ్మ సారె సమర్పణ కార్యక్రమం వేడుకగా జరిగింది. 46వ వార్డుకు చెందిన వాసుపల్లి అమ్మోరు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి పాడేరు నియోజకవర్గ పరిశీలకులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్న సమారాధన ప్రారంభించి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలాటం, తప్పెటగుళలతో చొక్కాకుల వెంకటరావుకు ఘనస్వాగతం పలికిన వాసుపల్లి అమ్మోరు, అనంతరం గజపూలమాల, దుశ్శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి–సింహాచలం: సింహాద్రి అప్పన్నను శుక్రవారం సెంట్రల్ జిఎస్‌టి అండ్ ఎక్సైజ్ కమిషనర్ కె.పంత్, ఎండోమెంట్ ట్రిబ్యునల్ జడ్జి కెవిఎల్. హరనాథ్, స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. కప్పస్తంబాన్ని ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణం అనంతరం స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ప్రసాదాన్ని స్వీకరించారు.

అకాల వర్షంతో ఆందోళన

- ఇటుక బట్టీల యజమానుల్లో గుబులు
- చోడిపైరు నేల కొరిగిపోయిందని రైతుల ఆవేదన

ప్రజాశక్తి-పద్మనాభం : ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆకాశం మేఘావృతమై కురుస్తున్న జల్లులు ఇటుకబట్టీల యజమానులు, రైతన్నల్లో గుబులు రేపుతున్నాయి. గురు,శుక్రవారాల్లో చిరుతుంపరలు పడగా, శని, ఆదివారాల్లో తీవ్రమయ్యే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికతో ఆందోళన చెందుతున్నారు. కాలంగాని కాలంలో కురుస్తున్న వర్షంతో నష్టపోక తప్పదని అంటున్నారు.
మండలంలోని మద్ది, పాండ్రంగి, పద్మనాభం, కృష్ణాపురం, బోని, సామయవలస, అనంతవరం, విలాస్‌ఖాన్‌పాలెం తదితర గ్రామాల్లో ప్రస్తుత సీజన్‌లో ఇటుకల తయారీ ఒక పరిశ్రమలా భారీ స్థాయిలో ఏటా జరుగుతోంది. ప్రస్తుతం తయారు చేసిన ఇటుకలను ఎండబెట్టేందుకు ఆయా ఇటుకబట్టీల వద్ద వేల సంఖ్యలో పరుపుల్లా ఉన్నాయి. ఏమాత్రం వర్షం కురిసినా అవి తడిసిపోయి, పూర్తిగా నష్టపోక తప్పదని ఇటుకల బట్టీల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఒకసారి తయారుచేసిన పరుపులోని ఇటుకలు పాడైతే అన్ని మదుపులతో కలిపి రూ.50వేలు నుంచి రూ.60వేలు వరకు నష్టం వాటిల్లుతుందని బుగత ప్రకాష్, కాళ్ల సన్యాసినాయుడు, కనకల నాయుడు, బోని అప్పన్న, బాయి శ్రీను తదితరులు ఆవేదన చెందుతున్నారు. అలాగని వేలసంఖ్యతో ఎండబెట్టిన ఇటుకలు తడవకుండా టార్పాలిన్లు వేయడం సాధ్యం కాదని వారంతా అంటున్నారు.



నేలకొరిగిన చోడి పంట



టార్పాలిన్లు కప్పేసి ఉంచిన ఇటుక బట్టీలు

అన్నదాతల్లోనూ ఆందోళన

అకాల వర్షం కురిస్తే ప్రస్తుతం పంట దశలో చోడి (రాగులు), మొక్కజొన్నలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గురువారం సాయంత్రం కురిసిన మోస్తరు జల్లులకే కోత దశకు వచ్చిన చోడిపైర్లు నేలకొరిగి పోయాయని రైతులు అంటున్నారు. చిరుజల్లులే తప్ప పెద్ద వర్షంగానీ, ఈదురుగాలులు గానీ లేకపోవడంతో మొక్కజొన్న పంటకు ప్రస్తుతానికి ఎటువంటి నష్టం లేదని అంటున్నారు. అయితే మరో రెండు రోజులు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలే ఆందోళన రేకెత్తిస్తున్నాయి.

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డిఇఒ



విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలిస్తున్న డిఇఒ చంద్రకళ

ప్రజాశక్తి – ఆరిలోవ : చినగదిలి మండలం, గోపాలపట్నం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం సందర్శించారు.పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ముఖద్వారం వద్ద చేపల దుకాణాల వ్యర్థాలు ఉండడం, మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడాన్ని గమనించారు. దీనిపై జివిఎంసి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మరుగుదొడ్లను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని పాఠశాల ఆయాను ఆదేశించారు.
అనంతరం పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును పరిశీలించారు. సంబంధిత రికార్డులు తనిఖీ చేసి, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనులను ప్రారంభించి పూర్తి చేయాలని వార్డు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను, హెచ్ఎంను ఆదేశించారు. విద్యార్థుల నోట్ బుక్స్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న విసిఆర్, డిసిఆర్‌లు వినియోగించుకోక పోవడం గమనించి వాటిని క్రమం తప్పకుండా వినియోగించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

ఎయు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిభూషణరావు

ప్రజాశక్తి– ఎంవిపి కాలనీ :ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య జి.శశిభూషణరావు నియమితులయ్యారు. ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. అనంతరం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఆచార్య శశిభూషణ రావును ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అభినందించారు.



విసి నుంచి నియామకపత్రాలు స్వీకరిస్తున్న శశిభూషణరావు

సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సదస్సు



సదస్సు ప్రారంభిస్తున్న సివిల్ విభాగం హెడ్ సత్యనారాయణ

ప్రజాశక్తి– ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్' అంశంపై శుక్రవారం నిర్వహించిన ఒకరోజు సదస్సును విభాగాధిపతి ఆచార్య సిఎన్‌వి సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీర ప్రాంతాలలో వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే నిర్మాణాలు జరపాలన్నారు. సాగర్ సిమెంట్స్ సీనియర్ మేనేజర్(టెక్నికల్ సర్వీసెస్) జనార్దన్ అరుణాచలం. విభిన్న వాతావరణ పరిస్థులకు అనుణంగా సిమెంట్ నిర్మాణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఐఐటి మద్రాస్ సివిల్ ఇంజనీరింగ్ పూర్వ ఆచార్యులు కె.రాజగోపాల్ జియో సింథటిక్ మెటీరియల్‌తో నిర్మించిన కన్నూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని వివరించారు. గర్‌వారె వాల్ ఫైబర్ లిమిటెడ్(పూణె) ప్రతినిధి రమేష్ చెట్టి రాక్‌ఫాల్ ప్రొటక్షన్, స్లోప్‌హిల్ స్లోప్స్ అంశంపై వివిధ ఉదాహరణలో వివరించారు. కెల్లెర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వై.హరికృష్ణ సస్టైయినబుల్ ఫౌండేషన్ టెక్నాలజీ అంశంపై ప్రసంగించారు. విభాగ ఆచార్యులు డాక్టర్ ఐ.శివపార్వతి కన్వీనర్‌గా వ్యవహరించిన సదస్సులో విభాగ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిద్రలేమితో అనారోగ్య సమస్యలు

డాక్టర్ ఫణీంద్ర, కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్, కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి

నేడు అంతర్జాతీయ నిద్ర దినోత్సవం



డాక్టర్ ఫణీంద్ర

ప్రజాశక్తి – గాజువాక : మనిషి జీవితంలో సగభాగమైన నిద్రకు ఎంతో ప్రాముఖ్యత ఉందని కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఫల్మనాలజిస్ట్ డాక్టర్ ఫణీంద్ర అన్నారు. సరిపడా నిద్ర లేకుంటే శారీరక, మానసిక రుగ్మతలు, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతాయని హెచ్చరించారు. ఏటా మార్చి మూడవ శుక్రవారం నిర్వహించే అంతర్జాతీయ నిద్ర దినోత్సవం సందర్భంగా నిద్ర ప్రాముఖ్యత, నిద్ర లేమితో వచ్చే వివిధ అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించడమే ముఖ్యోద్దేశ్యమన్నారు.
సగటు మనిషి జీవితం కాలంలో సుమారు 26ఏళ్ల నిద్రకు, మరో ఏడేళ్ల నిద్రలోకి జారుకోవడానికే సరిపోతుంది. అనేక ఆరోగ్య సమస్యలు నిద్రతోనే ముడిపడి ఉన్నాయి. నిద్రలేమితో అధికరక్తపోటు, మధుమేహం, ఊబకాయం, పక్షవాతం, హృద్రోగం వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రపంచ జనాభాలో 45శాతం మంది నిద్ర సమస్యలతో బాధపడుతుండగా, వీరిలో మూడో వంతుమంది మాత్రమే వైద్యులను సంప్రదిస్తున్నారని పరిశోధనా నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు.
నిద్రకు సంబంధిత జబ్బులలో స్లీప్ అప్నియా చాలా ముఖ్యమైనది. స్లీప్ అప్నియా ఉన్న వారికి ప్రధానంగా గురక, నిద్రలో ఊపిరి ఆగి మెలుకువ రావడం, పగలు అతి నిద్ర, నీరసం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. పాలీ సోమ్నోగ్రఫీ (నిద్ర పరీక్ష) ద్వారా ఈ సమస్యను గుర్తించవచ్చు. సిపిఎపి థెరపీ, బరువు తగ్గడం, కొన్ని రకాల శస్త్రచికిత్సల ద్వారా ఈ జబ్బుకు చికిత్స చేయవచ్చునని తెలిపారు.

ఇవీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, నిద్ర లేవడం ద్వారా ఆరోగ్యానికి మంచిది.
- రాత్రి వేళ తేలికగా జీర్ణమయ్యే ఆహారం తొందరగా తినేయాలి.
- కాఫీ, టీ ఎక్కువగా తాగడం, మద్యపానం, ధూమపానం నిద్రలేమి, నిద్ర సమస్యకు కారణమౌతాయి. వాటిని మానుకోవాలి.
- నిద్రపోయేందుకు కనీసం రెండుగంటల ముందే మొబైల్, కంప్యూటర్, టీవీ నుంచి వచ్చే బ్లూలైట్‌కు దూరంగాఉండాలి.
- క్రమం తప్పకుండా నిర్దిష్ట వ్యాయామం చేయాలి. అతి వ్యాయామం, జిమ్ మంచిదికాదు.
- రాత్రి నిద్ర పోయే ముందు తేలికపాటి నడక, ధ్యానం చేయడం, సంగీతం వినడం మంచిది.
- పగటిపూట 45 నిమిషాలకు మించి నిద్ర పోరాదు. పడక గది వాతావరణం తాజా గాలి వచ్చేలా, నిశ్శబ్దంగా అనుకూలంగా ఉండాలి
- మానసిక ఆందోళనను కలిగించే విషయాలు రాత్రిపూట నిద్ర సమయంలో చర్చించడం మంచిది కాదు.
- నిద్రలేమి గురక, ఆయాసం వంటి సమస్యలుంటే వెంటనే పల్మనాలజిస్ట్ లేదా స్లీప్ స్పెషలిస్ట్‌ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి..

1 నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

జిల్లా రిజిస్ట్రార్ జానకీ దేవి

ప్రజాశక్తి-కె.కోటపాడు

అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకు రెండు సచివాలయాల్లో ప్రయోగాత్మకంగా రిజిస్ట్రేషన్లు నిర్వహించగా అవి సత్ఫలితాలు ఇచ్చాయని, ఏప్రిల్ 1వ తేదీ నుండి 139 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు చర్యలు చేపడుతున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ జానకీ దేవి తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మొదటి దశలో అచ్యుతాపురం మండలం జి.అగ్రహారం, కోటవురట్ల మండలం చొల్లంగి పాలెం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేపట్టామని తెలిపారు. రెండవ దశలో భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపడతామని, ఇప్పటికే సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారికి పబ్లిక్ డేటా ఎంట్రీ ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ సులువుగా చేసుకోవచ్చన్నారు. అనకాపల్లి జిల్లాలో 306 కోట్ల రూపాయలు రెవెన్యూ నిర్దేశించగా ఇప్పటివరకు 225 కోట్ల రూపాయలు లక్ష్యాన్ని పూర్తి చేశామని తెలిపారు. కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రూ.6.44 కోట్లు వసూలు నిర్దేశించగా 4.65 కోట్ల రూపాయల లక్ష్యం పూర్తయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, సీనియర్ సహాయకులు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ జానకిదేవి, చిత్రంలో సబ్ రిజిస్ట్రార్ తదితరులు


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీ, భూముల రీసర్వే, సర్వేరాళ్లు ఏర్పాటు, తాగునీటి ఎద్దడి, నాడు-నేడు పనులు తదితర అంశాలను సమీక్షించారు. వాటి అమలు తీరుపై ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రోజారాణి, హౌసింగ్ డిఇఇ సత్యనారాయణ, ఎమ్పిడిఓ కొంకి అప్పారావు, మండల విద్యాశాఖ అధికారి చిట్టి బాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి


ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు సిపిఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక కొలపర్తి అప్పారావు ఏపీటీఎఫ్ భవనంలో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్న ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు వెంకటపతి రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గేట్ ఫలితాల్లో అన్నదమ్ముల సత్తా

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఆల్ ఇండియా గేట్ ఎంట్రన్స్ ఫలితాల్లో బుచ్చియ్యపేట మండలం రాజాంకు చెందిన ఇద్దరు అన్నదమ్ములు సత్తా చాటారు. న్యాయవాది గోగుల ఓం వరప్రసాద్ పెద్ద కుమారుడు డేవిడ్ తరుణ్ ఆలిండియాలో 76వ రాంకు, రెండో కుమారుడు జస్వంత్ 352వ ర్యాంకు సాధించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు ఆల్ ఇండియా గేట్ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీరిద్దరూ ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక విద్యను అభ్యసించడం విశేషం.


డేవిడ్ తరుణ్,


జశ్వంత్

ఆటో, కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని పరవాడ పోలీస్ స్టేషన్ నుండి గొర్లివానిపాలెం దారిలోని ఖుషి మార్కెట్ దగ్గర్లో శుక్రవారం రాత్రి 8.35 గంటల సమయంలో కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కథనం ప్రకారం... పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ బసవతారకంనగర్ కాలనీలో నివసిస్తున్న ఎల్లా సోమునాయుడు శుక్రవారం రాత్రి 8.35 గంటల సమయంలో గొర్లివానిపాలెం గ్రామం వైపు నడుచుకొని వెళ్తున్నాడు. ఈ సమయంలో ఎదురుగా వచ్చిన ఆటో కారుని ఢీకొని, అనంతరం సోమునాయుడుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సోమునాయుడు, ఆటో, కారు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురిని విశాఖ కేజిహెచ్‌కు 108 వాహనంలో తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎంఎంఎల్‌లో ప్రాంగణ నియామకాలు



ఎంపికైన విద్యార్థులు కళాశాల అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో శుక్రవారం అరబిందో కంపెనీ ఆధ్వర్యాన ప్రాంగణ నియామకాలు చేపట్టారు. అరబిందో ఫార్మా కంపెనీ హెచ్‌ఆర్‌లు విజయకృష్ణ, జయప్రకాష్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులను ఇంటర్వ్యూలు చేశారు. వీరిలో 15 మందిని ఎంపిక చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జయ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న అరబిందో కంపెనీలో ప్రొడక్షన్ సెక్షన్‌లో నియమించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నిరంజన్ కుమార్, కెమిస్ట్రీ హెడ్‌లు శ్యామల, సూరిబాబు, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, కెమిస్ట్రీ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అరుణ తదితరులు

'వైఎస్ఆర్ ఆసరా'పై ప్రచారం

ప్రజాశక్తి-కశింకోట

వైయస్సార్ మూడు విడత ఆసరా పథకంపై కశింకోట మండలంలోని పలు గ్రామాల్లో గడపగడపకి ప్రచారం శుక్రవారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి మహిళ, కుటుంబ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఇంటింటికి ఆసరా కరపత్రాలు పంపిణీ చేశారు. జె తునిలో స్థానిక సర్పంచ్ కోన అరుణ, వైసిపి నాయకులు కోన నాగేశ్వరరావు, కశింకోటలో సర్పంచ్ జయరజనీ, బయ్యవరంలో సర్పంచ్ గొల్లివిల్లి జయ, వెదురుపర్తి గ్రామంలో సర్పంచ్ శనివాడ అరుణ, మండల సమాఖ్య ఎపిఓ ఎమ్ శ్రీనివాసరావు, గ్రామ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- మునగపాక రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ బీమా పథకం పేదలకు వరప్రదాయని వంటిదని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామానికి చెందిన పలివెల దేవుడు ఇటీవల మరణించడంతో శుక్రవారం దహన ఖర్చులు నిమిత్తం రూ.10వేలు చెక్కును ఆయన కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తికి వైయస్సార్ బీమా ద్వారా లక్ష రూపాయలు అందజేయడం జరుగుతుందని, ఇందులో భాగంగానే తక్షణ సహాయంగా ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ అంజలి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ పాల్గొన్నారు.


బీమా చెక్కు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

వైసిపి ఆర్భాటాలకు నిధులు కేటాయింపు సిగ్గుచేటు



మాట్లాడుతున్న పరుచూరి భాస్కరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రాష్ట్ర బడ్జెట్లో 532 కోట్ల రూపాయలు కేటాయించడం సిగ్గుచేటని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో ఐటీ శాఖకు కేటాయించిన రూ.215 కోట్ల కంటే ప్రభుత్వ ఆర్భాటాలకు అధికంగా ఖర్చు చేయడం చూస్తే రాష్ట్ర అభివృద్ధి కన్నా తమ పార్టీ ఆర్భాటాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవచ్చుని పేర్కొన్నారు. వివిధ కార్పొరేషన్లకు కేటాయించిన నిధులు వాటి చైర్మన్‌లకు జీతాలు, హంగు ఆర్భాటాలకే సరిపోవన్నారు. ఒకపక్క పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూనే పర్యావరణానికి 685 కోట్లు కేటాయించడం చూస్తుంటే ఈ నిధులు దారి మళ్లించేందుకేనని పేర్కొన్నారు. సుమారు 60 వేల కోట్ల రూపాయలు నవరత్నాల పథకాలకు కేటాయించడం, ఆ భారాన్ని తిరిగి ప్రజలే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి బడ్జెట్లో నిధులు ఏవీ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి నామమాత్ర నిధులు కేటాయించడం బాధాకరమని అఖిలభారత బిసి ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు విల్లూరి పైడారావు విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేవలం రూ.10,386 కోట్లు కేటాయించి వెనుకబడిన వర్గాలను ఆదుకుంటున్నట్టు ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు. బీసీ వర్గాలకు బడ్జెట్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రైతులకు, నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చిత్తశుద్ధితో తుమ్మపాల చక్కర కర్మాగారాన్ని ఆధునికీకరించి ఈ ప్రాంత రైతాంగ రుణం తీర్చుకోవాలని కోరారు.

బడ్జెట్లో వికలాంగులకు మొండి చెయ్యి

రాష్ట్ర బడ్జెట్లో వికలాంగులకు మొండి చేయి చూపిందని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాతరపల్లి వీరు యాదవ్ విమర్శించారు. శుక్రవారం వుడ్ పేట సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం వికలాంగులకు రూ.3వేలు పించను ఇవ్వగా, ఈ నాలుగేళ్లలో వికలాంగుల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. వికలాంగుల పట్ల వివక్ష చూపిస్తే రానున్న ఎన్నికల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో కోరుకొండ నాగరాజు, బాదంపూడి నాగేష్, గంజి కనకరాజు, మొల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీశెట్టి దొరమ్మ నాయుడు

యోగాతో మానసిక, శారీరక రుగ్మతలు దూరం

ప్రజాశక్తి-అనకాపల్లి

యోగాతో శారీరక, మానసిక రుగ్మతల నుంచి దూరం కావచ్చని ప్రముఖ యోగ గురువు భీశెట్టి దొరమ్మ నాయుడు అన్నారు. స్థానిక గవరపాలెం మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు భారత స్వాభిమాన ట్రస్ట్, పతంజలి యోగ సమితి సంయుక్త పర్యవేక్షణలో ఉచిత యోగ శిక్షణ నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దొరమ్మనాయుడుతో పాటు సంఘ సేవకులు పెంటకోట సుబ్రహ్మణ్యం, 81వ డివిజన్ కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా దొరమ్మ నాయుడు మాట్లాడుతూ నిరంతరం ఒత్తిడిలో ఉన్న మహిళలకు యోగ ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశాఖ సాయి నాగేశ్వరరావు, కోలపర్తి కన్నబాబు, దాడి శ్రీను, కాండ్రేగుల గోవిందు, మహిళ యోగ సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డి ఎన్నికపై 'అపుస్మా'హర్షం

ప్రజాశక్తి-కె.కోటపాడు

'అపుస్మా" రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రామచంద్రారెడ్డి పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంపట్ల ఆ సంఘం ఐటి విభాగం రాష్ట్ర చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఖాసీం శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ప్రతినిధి మొట్ట మొదటి సారిగా శాసన మండలిలో విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై వాణి వినిపించే అవకాశం కలగడం ఆనందదాయకమని పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో డాక్టరు ఖాసీంతోపాటు అపుస్మా స్టేట్ చీఫ్ మెంటార్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కోశాధికారి ఎంవి.రావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు సీతారామరాజు, కార్యదర్శి ఆదిరెడ్డి రమణ, కోశాధికారి భీశెట్టి ప్రసాదరావు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు డాక్టరు శ్రీనివాసరావు, కార్యదర్శి ఎంవివి.సత్యనారాయణ, కోశాధికారి శేషారెడ్డి ఉన్నారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నూతన జిల్లాగా ఆవిర్భవించిన నేపథ్యంలో ఏడు నియోజకవర్గాలకు ప్రధాన కేంద్రమైన అనకాపల్లిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొణతాల హరినాథ్ బాబు శుక్రవారం కలెక్టర్ రవి పఠాన్ శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో రోజు రోజుకు కిడ్నీ వ్యాధి గ్రస్తులు పెరుగుతున్నారని, విశాఖపట్నం వెళ్లి డయాలసిస్ చేసుకుంటే వేల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. దీని వల్ల పేద మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర గుడివాడ అమర్నాథ్, ఎంపీ సత్యవతి, ఇతర రాజకీయ ప్రముఖులు స్పందించి డయాలసిస్ కేంద్రం అనకాపల్లి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న ఆప్ నాయకులు

టిడిపి విజయోత్సవాలు



అనకాపల్లిలో సంబరాలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు దాదాపుగా విజయం ఖాయమైన నేపథ్యంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విశాఖ, అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాలత్లో విజయోత్సవాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లిలోని టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పని అయిపోయిందని ప్రగల్బాలు పలికిన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రులు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరే సతీష్, డాక్టర్ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, పాల్గొన్నారు. టిడిపి బీసీ సాధికారత సమితి



అచ్యుతాపురంలో..

రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర ఆధ్వర్యంలో స్థానిక భీముని గుమ్మం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కొణతాల రత్నకుమారి, పోలవరపు త్రినాథ్ పాల్గొన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) ఆధ్వర్యంలో స్వీట్లు పంచి ద్విచక్ర వాహన ప్రదర్శన నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. నాయకులు గొర్లి శ్రీనివాసరావు, నడిపల్లి బోసు బాబు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట మండల కేంద్రంలో టిడిపి నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆ పార్టీ నాయకులు వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కలగా సోమేశ్వర రావు, ఎస్‌కె.బాబర్, తాకాశి కృష్ణ పాల్గొన్నారు. తాళ్ళపాలెం జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉల్లింగల రమేష్ జెర్రిపోతల నూకి నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ జంక్షన్‌లో టిడిపి మండల అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం నుండి ఎన్టీఆర్ జంక్షన్ మీదుగా దుర్గమాంబ ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండి రవి కుమార్, బర్ణికాన బాబురావు, గండి దేముడు, గండి. ముత్యాల నాయుడు, కోటాన అప్పారావు, సర్పంచ్ దెడ్డము ప్రసాదరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడు మూడు రోడ్ల కూడలిలో టిడిపి నాయకులు విజయోత్సవ సంబరాలు చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు మాట్లాడుతూ వేపాడ చిరంజీవిరావు గెలుపు టిడిపి పునర్వైభావానికి నాంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రొంగళి మహేష్, నాయకులు దోకల నరసింహమూర్తి, పూడి నారాయణ మూర్తి, దాడి ఎరుకునాయుడు, బండారు నరసింహ నాయుడు, పైల గోపి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం టిడిపి కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, పుర్రె శ్రీనివాసరావు, రాజన్న నానాజీ, కాండ్రేగుల సూర్యనారాయణ, కర్రి ఆదిబాబు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది, రాజాం, బుచ్చయ్యపేట తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టిడిపి నాయకులు పూలమాలలు వేసే నివాళు లర్పించారు. బాణసంచా కాల్చి సంబరాలు చేశారు.

కోటవురట్ల : టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వేచలపు జనార్ధన్, పుట్రవు సూర్యారావు, తిరుమలరావు, ఎంపిటిసి సభ్యులు సూర్యప్రకాష్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

రావికమతం : మండల కేంద్రంలో సర్పంచ్ గెంజి మోది నాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. ఉన్నత చదువులు చదువుకున్న పట్టభద్రులు దూర దృష్టితో ఆలోచించి ఓటు వేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మరుపాక ఎంపీటీసీ సూర్యనారాయణ, రావికంతం ఎంపిటిసి నాగేశ్వరరావు, కన్నంపేట మాజీ ఎంపిటిసి బంటు శ్రీను పాల్గొన్నారు.

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల తీర్పుతో రాష్ట్ర రాజకీయాల్లో మార్పు ఖాయమని టిడిపి గాజువాక



భీమిలి మండలం తాళ్లవలసలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర, విశాఖను దోచేసిన వైసిపి నేతలకు మంచి ఆలోచనతో విజ్ఞత ప్రదర్శించిన ఉత్తరాంధ్ర పట్టభద్రులు గట్టిగా బుద్ధి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పులి వెంకటరమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ. టిడిపి నాయకులు విల్లా రామ్మోహనకుమార్, కోగంటి లెనిన్‌బాబు, నల్లూరి సూర్యనారాయణ, బైపల్లి గాంధీ పాల్గొన్నారు.

తగరపువలస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి బలపరిచిన వేపాడ చిరంజీవిరావు విజయానికి చేరువ కావడంతో తాళ్ళవలసలో పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్ళు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్లవలస ఎంపిటిసికోరాడ రమణ, మాజీ జెడ్‌పిటిసి సరగడ అప్పారావు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పతివాడ రాంబాబు, మాజీ సర్పంచ్ పొట్నూరు రాము, నాయకులు అల్లు చిన్నయ్య, తమ్మిన వెంకటరమణ పాత్రుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాజువాక నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు

ఆరిలోవ : తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఐదు వార్డుల నేతలంతా 12వ వార్డు టిడిపి కార్యాలయంలో శుక్రవారం విజయోత్సవం జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం తోటగరువు నుంచి బాలజీనగర్ మీదుగా అంబేద్కర్‌నగర్, ఆరిలోవ, టిఐసి పాయింట్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవిందు, మద్దిల రాజశేఖర్, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, పాత్రకండ ధర్మారావు, మూది అప్పారావు పాల్గొన్నారు.



సబ్బవరంలో...



కోటవురట్లలో...



ఆరిలోవలో...

కొత్త అమావాస్య జాతర ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీనూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జారతలో భాగంగా అమ్మవారి మాల ధారణ సేవా సంఘం అధ్యక్షులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో 108 ఘటాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో పట్టణంలోని పురవీధుల్లో ఊరేగింపు జరిగింది. రథోత్సవాన్ని ఖోఖో సంఘం జిల్లా అధ్యక్షులు దాడి జైవీర్ ప్రారంభించారు. ఊరేగింపులో 20 రకాల నేలవేషాలు, శూలధారణ, అమ్మవారి వేషధారణ, పులి వేషాలు, తెలంగాణ పోతురాజు విన్యాసాలు, కేరళ వాయిద్యాలు, ఒరిస్సా కళాకారుల బలంగీర్ భాజ వంటి పలు వేషాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి బుద్ధ లక్ష్మీ నగేష్, కార్పొరేటర్లు కొణతాల నీలిమ భాస్కరరావు, పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు, కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ తదితరులు పాల్గొన్నారు.



జాతర సందర్భంగా ఊరేగింపు చేస్తున్న దృశ్యం

టెన్త్ మోడల్ టెస్ట్ ఫలితాలు విడుదల

-20న బహుమతుల ప్రదానం- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రమణ

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి, ఎస్.రాయవరం మండలం లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరిగిన టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్ ఫలితాలను శుక్రవారం నక్కపల్లి సిఐటియు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రమణ మాట్లాడుతూ, పరీక్షలంటే విద్యార్థుల్లో భయాందోళన పోగొట్టడానికి, వారిలో ఉన్న ప్రతిభను వెలుగు తీసేందుకు గాను పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్ నిర్వహించామన్నారు. ఈ మోడల్ టెస్ట్‌లో సుమారుగా 17 స్కూల్ నుండి 730 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. మొదటి స్థానంలో ఎస్ నాగసాయి ప్రవీణ్ (శ్రీ ఆదర్శ స్కూల్), రెండవ స్థానం పి.బేబీ (విశ్వశాంతి హైస్కూల్), మూడవ స్థానం జి బిందు (గర్ల్స్ హైస్కూల్ ,నక్కపల్లి) స్థానాల్లో నిలిచినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు ఈనెల 20న బహుమతుల ప్రధాన చేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.బాబ్జి, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రమణ


గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్న ఎంపిడిఒ

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-నక్కపల్లి: స్థానిక వీవర్స్ కాలనీలో అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో సీతారామరాజు తనిఖీ చేశారు. అంగన్వాడీ పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందజేస్తున్నారా లేదా అని ఆరా తీసారు. పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. రక్తహీనత కలిగిన పిల్లలు, గర్భిణీలు, బాలింతలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్వాడీ టీచర్‌కు సూచించారు. పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండవచ్చునన్నారు. రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారాన్ని గర్భిణీలకు, బాలింతలకు అందజేసారు.

జాతీయ రహదారి పనులు వేగవంతం

ప్రజాశక్తి-గొలుగొండ: రాజమహేంద్రవరం - విజయనగరం జాతీయ రహదారి(ఎన్‌హెచ్- 516ఈ) నిర్మాణంలో భాగంగా ఏఎల్‌పురం వద్ద చేపట్టిన బైపాస్ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం రాజఒమ్మంగి కాకరపాడు జంక్షన్ పాత కేడిపేట, ఏఎల్ పురం మీదుగా పెదవలస వైపు రహదారి ఉంది. మేజర్ పచాయతీ ఏఎల్‌పురంలో నుంచి జాతీయ రహదారి నిర్మాణం చేపడితే చాలా ఇళ్లను తొలగించాల్సి వస్తుంది. నిర్వాసితులకు భారీగా నష్టపరిహారం ఇవ్వాలి. దీనికి తోడు వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగి, ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంది. దీంతో రాజఒమ్మంగి నుంచి వచ్చేటప్పుడు గొలుగొండ మండలం నాగాపురం పంచాయతీ వల్లాపూరు శివారు నుంచి పాత కృష్ణదేవిపేటకు ఉత్తరం వైపుగా బడ్డేరు గెడ్డ దాటి అల్లూరి పార్కు సమీపంలో నుంచి కొయ్యూరు మండలం నడింపాలెం వద్ద పాత రోడ్డులో కలిసేలా బైపాస్ రోడ్డు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గతంలోనే భూసేకరణ జరిగింది. కొద్ది కాలం క్రితం పనులు ప్రారంభించారు. బడ్డేరు గెడ్డపై వంతెన నిర్మాణం, చిన్నపాటి గెడ్డలు, వాగుల వద్ద కల్వర్టుల నిర్మాణం జరుగుతుంది. మట్టి చదును పనులు పూర్తయిన చోట మెటల్ పరిచి రోలింగ్ చేస్తున్నారు.


చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు


రికార్డులను పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పెదబోధిగల్లం పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఈఓపిఆర్డి పీ. వెంకటనారాయణ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నుల వసూలుకు సంబంధిం చిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శానిటేషన్ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి సంసున్నీషా బేగంకు సూచించారు. సచివాలయంలో సేవలు ప్రజలకు సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సర్పంచ్ ఫాతి మున్నిషా బేగంతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన అంగన్వాడీ భవనాలు అసంపూర్తిగా మిగిలి పోయాయి. ఈ మేరకు కొంగసింగి, నాగాపురం, చోద్యం తదితర గ్రామాల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఆ భవనాలు తుప్పలతో దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా గ్రామాల్లో నిరుపయోగంగా ఉండటంతో భవనాల్లో కొంత మంది అకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏఎల్‌పురం, గైరంపేట అంగన్వాడీ భవనాలకు నెలల తరబడి నిధులు మంజూరు చేయక ఆ నిర్మాణాలు గోతులకే పరిమితమయ్యాయి.

పారిశుధ్యం మెరుగుకు వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీలో పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కనకారావుకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీలో పారిశుద్యం అధ్వాన్నంగా ఉందన్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయలేదన్నారు. ఏడాదికి సుమారు 8 కోట్ల పన్నులు రూపంలో మున్సిపాలిటీకి ఆదాయం వస్తున్నా సమస్యలను పరిష్కరించ లేదన్నారు. మున్సిపాలిటీలో పందులు, కుక్కల సమస్య తీవ్రంగా ఉందన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యలన్నీ పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.


వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ సౌజన్య


రాళ్లు తేలిన రహదారి

రహదారులు అస్తవ్యస్తం

- అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాతకృష్ణదేవిపేట బంగారంపేట, కృష్ణదేవిపేట చోద్యం, ఏఎల్‌పురం కొంగసింగి తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ రాళ్లు తేలి గోతులు పడ్డాయి. దీంతో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. నిత్యం ఈ రహదారులు రద్దీగా ఉన్నా కనీసం గోతులను పూడ్చేవారు కరువయ్యారు. ఇక వర్షాలు కురిసేటప్పుడు పరిస్థితి మరీ దారుణం. రహదారుల్లో ఎక్కడ గోతులు ఉన్నాయో గుర్తించని విధంగా వాటిలో నీరు చేరుతుంది. ఫలితంగా పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని సమయాల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఏళ్ల తరబడి రహదారుల దుస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

బోరు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో తట్టబంద పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో మంచినీటి బోరు మరమ్మతులను సర్పంచి గోకివాడ రమణ ఆధ్వర్యాన శుక్రవారం చేపట్టారు. వేసవికాలం ప్రారంభం కావడంతో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను చర్యలు చేపట్టినట్లు సర్పంచి తెలిపారు.


చేపడుతున్న మరమ్మతు పనులు

వైద్యులు మల్లికార్జునరావుకు సత్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఉమానారాయణ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు పుల్లేటి మల్లికార్జునరావు ను అల్లూరి జిల్లా గిరిజన సంఘం నేతలు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా గిరిజన సంఘం అధ్యక్షులు టి.మల్లేష్ మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న ఎందరో గిరిజనులను ఆదుకుని ప్రాణాలు పోస్తున్నారని కొనియాడారు. ఎంతో మంది చిన్నారులకు సమయానికి వైద్యం అందించారన్నారు. వైద్యులు మల్లికార్జునరావు మాట్లాడుతూ, చిన్న పిల్లలకు పండ్ల రసాలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, కాయగూరలు, పప్పుతో కూడిన ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్ వినాయక ల్యాబ్ ఇన్చార్జ్ చిన్నా పాల్గొన్నారు.


జ్ఞాపికను అందజేస్తున్న గిరిజన సంఘం నేతలు

బడ్జెట్‌లో ఉపాధిపై ప్రస్తావన ఏదీ?

- డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి- కలెక్టరేట్:అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతకు ఉపాధి ప్రస్తావన లేకపోవడం అన్యాయమని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.ఎస్.ఎన్ రాజు ఒక ప్రకటనలో ఖండించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఇవ్వాల్సిన ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు ఈ బడ్జెట్ లో లేకపోవడాన్ని ఖండించారు. రాష్ట్రంలో 2.36 లక్షల ఉద్యోగాల ఖాళీలు ఉన్నా వాటిని భర్తీ చేయడానికి కార్యాచరణ ప్రకటించలేదని విమర్శించారు. యువతకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో 50,670 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదని విమర్శించారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ హామీ ఇచ్చిన జగన్ సర్కారు యువత నమ్మకాన్ని వమ్ము చేసిందన్నారు. వసతి దీవెన, విద్యా దీవెనలకు బడ్జెట్ కేటాయింపులు పెంచామని మంత్రి బొత్స చెప్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, బోధన చార్జీలు ఎందుకు పెంచలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యువతకు జరిగిన అన్యాయంపై ఉద్యమిస్తామని చెప్పారు.

ఎంసిలో పెరిగిన మెడికల్ పిజి సీట్లు

ప్రజాశక్తి- కలెక్టరేట్:ఆంధ్రా మెడికల్ కాలేజిలో మెడికల్ పీజి సీట్లను ప్రభుత్వం భారీగా పెంచిందని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.బుచ్చిరాజు మీడియాకు తెలిపారు. సిటి సర్జరీలో 4 సీట్లు, డివిఎల్ లో 7 నుంచి 10, ప్రసూతి విభాగంలో 26 నుంచి 37, పెథాలజీలో 5 నుంచి 12, సైకాలజీలో 5 నుంచి 12, న్యూరాలజీలో 3 నుంచి 5, సర్జరీలో 19 నుంచి 26, కమ్యూనిటీ మెడిసిన్‌లో 6 నుంచి 12 సీట్లుకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పెరిగిన సీట్లకు అనుగుణంగా కౌన్సిలింగ్ లో పిజి విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని ఆయన తెలిపారు.

ఇదిలా ఉండగా మెడికల్ కాలేజీలో పీజీ సీట్లు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ కాలేజీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం, వైద్య పరికరాలను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లను నూతన బడ్జెట్ లో కేటాయించింది.



సిబ్బందితో మాట్లాడుతున్న నర్సింగరావు

రోగులకు వైద్యం అందించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక 50 పడుకుల ఆసుపత్రిని శుక్రవారం కాయకల్ప టీం తనిఖీ చేసింది. విజయవాడ నుండి వచ్చిన బృందంలోని డాక్టర్ జేడీ నర్సింగరావు నేతృత్వంలో ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టారు. రిజిస్టర్లు, స్టోర్‌లో వున్న మందులను పరిశీలించారు. ఆస్పత్రి జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో వున్న పరికరాలను పరిశీలించారు.అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ జనార్ధన్, డాక్టర్ జయలక్ష్మి, పలువురు వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా ముందుగానే ఇండెంట్ పెట్టుకుని అవసరమైన మందులను తెప్పించుకోవాలని సూచించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలోని బయ్యపు రెడ్డిపాలెంలో సీతారామ చంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో 10వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కళ్యాణమండపం సిద్ధం చేశారు. జాతీయ పురస్కార గ్రహీత పానంగిపల్లి రంగనాథ చార్యులు, సీతారామాచార్యులు శాస్త్రోక్తకంగా శ్రీనివాస కళ్యాణం నిర్వహించారు.శనివారం మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం డోలోత్సవంలో భాగంగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

20న చలో విజయవాడను జయప్రదం చేయాలి

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఈనెల 20న జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి తరలి రావాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కే.ప్రసన్న పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారంకు ఈ నెల 20న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు.రాష్ట్రంలో అనేక ఏళ్ళుగా పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీసవేతనాలు, పీఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా వంటి పథకాలు ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. యూప్‌లో అప్లోడ్ చేయపోతే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మెనూ చార్జీలు సమయానుకూలంగా జమ చేయ లేదని తెలిపారు. 2022డిసెంబర్ నెల బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారంకు ఛలో విజయవాడను చేపడుతున్నామన్నారు. సమావేశంలో సంఘం నాయకురాలు జగది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్న

నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

-రూ.17 లక్షలతో నిర్మాణం - ప్రారంభించకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో లింగాపురం సెంటర్ వద్ద దాదాపు రూ.17 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా దర్శనమిస్తుంది. గత ప్రభుత్వంలో నిర్మాణం మొదలు పెట్టిన ఈ కాంప్లెక్స్‌కు లింగాపురం పంచాయతీ నిధుల నుండి ఐదు లక్షల ఖర్చు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో సుమారు 12 లక్షల వరకు ఖర్చు చేసి 15 షాపులు నిర్మాణం చేపట్టారు. గడిచిన రెండు సంవత్సరాలుగా షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉండటం విశేషం. షాపింగ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తే పంచాయతీకి ఆదాయంతో పాటు కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి లభించేదని ఆయా ప్రాంతాల వాసులు తెలిపారు.

ఇదిలా ఉండగా నేటికీ నిర్మాణదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభించడంలో జాప్యం జరుగుతుందని తెలిసింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు

చైర్మన్‌గా రాంబాబు ఎన్నిక

ప్రజాశక్తి -కలెక్టరేట్:కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు నూతన ఛైర్మన్‌గా కొమ్మారెడ్డి రాంబాబు శుక్రవారం ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు బ్యాంకు వ్యవస్థాపక ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించిన రాంబాబును పాలక వర్గం ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ మేరకు ఎన్నికల అధికారి శంకర్ నియామక పత్రాన్ని రాంబాబుకు అందజేశారు. అక్కయ్యపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు పాల్గొని నూతన ఛైర్మన్‌కు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. అనంతరం నూతన ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ, బ్యాంకు స్థాపించినప్పటి నుంచి వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరు రఘునాధరావు వెన్నంటే ఉండి, ఆయన అడుగు జాడలతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తూ వచ్చానన్నారు. ఖాతాదారుల అభిమానం, సిబ్బంది పనితీరుతో 24 ఏళ్లుగా బ్యాంకు విభిన్న సేవలందిస్తూ అందరి ఆదరాభిమానాలను పొందుతూ వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో బ్యాంకును మరింత అభివృద్ధి చేసేందుకు, ఖాతాదారులకు మెరుగైన సేవలందిం చేందుకు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉమ్మడి 7 జిల్లాలో 25 శాఖలను ఏర్పాటు చేసామని, రానున్న రోజులలో మరో మూడు శాఖలు (గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం జిల్లాల్లో) ఏర్పాటుకు ఆర్బీఐ అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, సిఈవో కె.శ్యామ్‌కిషోర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అభినందనలు అందుకుంటున్న రాంబాబు

మోసపూరిత బడ్జెట్

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ గిరిజన వ్యతిరేక బడ్జెట్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. శుక్రవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో మండల కార్యదర్శి కె.రామారావుతో కలిసి విలేకర్ల సమావేశంలో పి.అప్పలనర్స మాట్లాడుతూ,బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు కనీసం 25 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా కేటాయించిన వాటిలో కూడా సగానికి సగం కోతలు పడుతున్నాయన్నారు. గత సంవత్సరం 20 వేల కోట్లు కేటాయించారని, సాధారణ పథకాలకు మళ్ళించారని తెలిపారు.గిరిజన సబ్ ప్లాన్ చట్టం ప్రకారం రూ.16140 కోట్లు కేటాయించాల్సి ఉందని, 10 వేల కోట్ల కోత విధించారన్నారు.కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రస్తావన లేదని అన్నారు. ఈ నిధులతో పోలవరం పునరావాసం, వెలిగొండ, హంద్రీనీవా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయ్యే జాడ లేదన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల ప్రస్తావన లేదని తెలిపారు. 4 ఏళ్ళ క్రితం చెప్పిన వాటిని పునశ్చరణ చేయడం తప్ప కొత్త పథకాలేవీ ప్రకటించలేదని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజానీకం వ్యతిరేకించవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఉపాధి కల్పనకు, పారిశ్రామిక అభివృద్ధికి వెచ్చించింది నామమాత్రమే అని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం వాటా 10శాతం కింద రూ.500 కోట్లు కేటాయించాల్సి ఉందని, అటువంటి ప్రతిపాదనలేవీ బడ్జెట్‌లో లేవని తెలిపారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టమైంది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పట్టభద్రుల ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉదయం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను విజయపథాన నిలిపిన గ్రాడ్యుయేట్ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. తమ అభ్యర్థిని ఫిబ్రవరి ఒకటిన ప్రకటించామని, తక్కువ వ్యవధిలోనే మంచి విజయం సాధించామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ధోరణి కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూడాలని పవన్ కల్యాణ్ చెప్పిన విషయం ఈ ఎన్నికల్లో రుజువైందని అన్నారు. రాజధాని వ్యవహారం సహా వైసిపి చెప్పిన మాటలను ప్రజలు నమ్మలేదన్నారు.

మాధవ్‌కు ఘోర పరాభవం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ, బిజెపి అభ్యర్థి మాధవ్‌కు డిపాజిట్ కూడా దక్కలేదు. అతనికి 10,884 ఓట్లు వచ్చాయి. అతనికి వచ్చిన ఓట్లు కంటే చెల్లని ఓట్లే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ ఎమ్మెల్సీ స్థానానికి పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు 12,318గా ఉన్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి మాధవ్‌కు కనీస ఓట్లు రాకపోవడం వెనుక స్టీల్ ప్రైవేటీకరణ అంశం, కేంద్ర ప్రభుత్వ విధానాలు గట్టిగా ప్రభావం చూపాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.